## ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 4 : ఉమ్మడి జిల్లాలో ఓపెన్ స్కూల్ దూర విద్యా విధానంలో ఇటీవల నిర్వహించిన పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలను www.telanganaopenschool.org వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు ఆదిలాబాద్ డీఈవో ప్రణీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెబ్‌సైట్‌లో ఉంచిన మార్క్స్ మెమోలో ఏవైనా పొరపాట్లు ఉన్నట్లయితే ఈనెల 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈనెల 16వరకు మీ సేవ ద్వారా ఫీజు చెల్లించవచ్చని డీఈవో తెలిపారు.

# 27న సింగరేణి ఎన్నికలు

- తాజాగా తేదీ ఖరారు
- ఇప్పటికే గుర్తుల కేటాయింపు
- ఏర్పాట్లలో యాజమాన్యం
- కార్మిక సంఘాలకు ఓటరు లిస్టు అందజేసిన ఎన్నికల అధికారి
- పదకొండు ఏరియాల్లో 39,748 మందికి ఓటు హక్కు



శ్రీరాంపూర్ : కార్మిక సంఘాలు, యాజమాన్యంతో చర్చిస్తున్న డీవైసీఎల్‌సీ శ్రీనివాసులు

శ్రీరాంపూర్, డిసెంబర్ 4: అక్టోబర్ 28న సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని సెప్టెంబర్ 27న నోటిఫికేషన్ ఇచ్చారు. అక్టోబర్ 6, 7 తేదీల్లో నామినేషన్లు స్వీకరించారు. 10న పరిశీలించి, 13 కార్మిక సంఘాలు బరిలో ఉంటున్నట్లు డిప్యూటీ లేబర్ కమిషనర్, ఎన్నికల అధికారి శ్రీనివాసులు ప్రకటించారు. గుర్తులు కూడా కేటాయించారు. కానీ, అప్పటికే (అక్టోబర్ 9న) అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ రావడంతో సింగరేణి ఎన్నికలు వాయిదా వేయాలని యాజమాన్యంతోపాటు మెజార్టీ కార్మిక సంఘాలు అభ్యంతరం తెలిపాయి. ఈ క్రమంలోనే హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ ప్రక్రియ ఇలాగే ఉంటుందని, డిసెంబర్ 27న ఎన్నికలు నిర్వహించుకోవాలని అక్టోబర్ 11న స్పష్టం చేసింది. ఈ నెల 3న అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ పూర్తి కావడంతో ఎన్నికల ప్రత్యేకాధికారి, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులు సోమవారం 13 కార్మిక సంఘాల ప్రతినిధులతో హైదరాబాద్‌లోని రీజినల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నిలిచి పోయిన ఎన్నికల ప్రక్రియను తిరిగి మొదలు పెట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు గుర్తింపు ఎన్నికల కోసం కావాల్సిన ఏర్పాట్లు చేయడానికి సింగరేణి అధికారులు అంగీకారం తెలిపారు. నవంబర్ 30లోగా పదకొండు ఏరియాల పరిధిల్లో విధుల్లో ఉండే 39,748 మందితో ఉన్న కార్మికుల ఓటరు లిస్టును ఎన్నికల ప్రత్యేకాధికారికి అందజేశారు. ఆ తర్వాత కార్మిక సంఘాల ప్రతినిధులకు ఓటరు లిస్టును డీవైసీఎల్‌సీ అందించారు. 27న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రి 7 గంటల నుంచి ఏరియాల వారీగా ఓట్లు లెక్కించనున్నారు. ఈ నేపథ్యంలో నేటి నుంచి కార్మిక సంఘాల నాయకులు ప్రచారంలో మునిగి తేలనున్నారు. డీవైసీఎల్‌సీతో జరిపిన చర్చల్లో గుర్తింపు కార్మిక సంఘం టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బాజీ సైదా, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

**• 39,832 మంది కార్మికులకు ఓటు హక్కు**

సింగరేణిలో 27న జరిగే ఎన్నికల్లో 39,832 మంది కార్మికులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ మేరకు కార్మిక సంఘాలకు ఓటరు లిస్టును డిప్యూటీ లేబర్ కమిషనర్ శ్రీనివాసులు అందజేశారు. బెల్లంపల్లి డివిజన్‌లో 985 మంది, మందమర్రిలో 4876 మంది, శ్రీరాంపూర్‌లో 9124 మంది, కొత్తగూడెం కార్పొరేట్‌లో 1192 మంది, కొత్తగూడెం డివిజన్‌లో 2370, మణుగూరులో 2414 మంది, ఇల్లందులో 603 మంది, ఒడిషాలో నైని బ్లాకులో కేవలం ఇద్దరు ఓటర్లు, భూపాలపల్లిలో 5350 మంది, రామగుండం-1లో 5430 మంది, ఆర్జీ-2లో 3479 మంది, ఆర్జీ-3లో 3063, ఏపీఏలో 944 మంది కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు శ్రీనివాసులు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

CHANGE OF NAME

★ I, MOHAMMAD HASNUDDIN S/o MOHAMMAD SHAREEFUDDIN. (Old name) R/o. H.No. 5-103/1, G.D. Nagar, Kannala, Kamanpur Mandal, Peddapally District. have Changed my name as MOHAMMAD HASNODDIN S/o MOHAMMAD SHARIFODDIN (New name)
NTK-0000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం

200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి

50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677

# ముగిసిన ఎన్నికల ఘట్టం..

- ఊపిరిపీల్చుకున్న యంత్రాంగం..
- 45 రోజుల పాటు అధికారులు బిజీ



ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ (ఫైల్)

నిర్మల్ టౌన్, డిసెంబర్ 4: నిర్మల్ జిల్లాలో 2023 శాసనసభ ఎన్నికల ఘట్టం ముగిసింది. నవంబర్ 3 నుంచి ప్రారంభమైన నామినేషన్లను పురస్కరించుకొని ఈనెల 3 వరకు ప్రకటించిన ఎన్నికల ఫలితాల వరకు జిల్లాలో యంత్రాంగం ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. నిర్మల్ జిల్లాలో మొత్తం నిర్మల్, ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గాలుండగా 7.11లక్షల పైచిలుకు ఓట్లు ఉండడంతో ఎన్నికల నిర్వహణపై ఎలక్షన్ కమిషన్ ఆదేశాలతో కలెక్టర్ పకడ్బందీగా నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ కు ముందే ఎన్నికల నిర్వహణపై ఎలక్షన్ కమిషన్ నిర్మల్ కలెక్టర్‌గా పని చేసిన వరుణ్‌రెడ్డిపై బదిలీ వేటు వేయడంతో అప్రమత్తమైన జిల్లా యంత్రాం గం ఎటువంటి పొరపాట్లు లేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రాజకీయ చైతన్యం ఉన్న ఈ జిల్లాలో ఎన్నికల నిర్వహణ కత్తిమీద సాములా మారిన నేపథ్యంలో రాజకీయ పార్టీల నేతలు మూడు నియోజకవర్గాల్లో హోరాహోరీగా తలపడ్డాయి. జిల్లాలో మొత్తం 922 పోలింగ్ కేంద్రాలుండగా ఖానాపూర్ నియోజకవర్గంలోని ఖానాపూర్, కడెం, దస్తురాబాద్, జన్నారం, ఉట్నూరు, ఇంద్రవెల్లి, తదితర గ్రామాల్లోని ఏజెన్సీ ప్రాంతం కావడంతో పోలీసు, రెవన్యూశాఖ ఎన్నికల పోలింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందే గుర్తించిన జిల్లా అధికారులు ఆ ప్రాంతంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు వేసే విధంగా స్వీప్ ద్వారా సామాజిక చైతన్య కార్యక్రమాలను నిర్వహించింది. ఆ ప్రాంతంలో పోలీసుశాఖ ప్రత్యేకంగా క్యూబింగ్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా గతేడాది 77శాతం ఓటింగ్ నమోదు కాగా ఈసారి దాన్ని మరింత పెంచేందుకు స్వీప్ ద్వారా నెల రోజుల పాటు సామాజిక చైతన్య కార్యక్రమాలను నిర్వహించింది. ప్రతి పోలింగ్ బూత్‌లో 1250 మంది ఓట్లు వేసే విధంగా అదనంగా130 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ వంటి శాఖల సమన్వయంతో పోలింగ్ పక్రియను ఈనె 30న పూర్తి చేసిన అధికారులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవడంతో ఎన్నికల ఘట్టం ముగిసింది. ఎన్నికల కౌటింగ్‌ను ఈనెల 3న ముగియడంతో గెలుపొందిన అభ్యర్థులకు ధ్రువీకరణపత్రాలను జారీ చేసింది. జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రత్యేక అబ్జర్వర్లు రవికుమార్ రంజాన్, గోపాల కృష్ణ ఎన్నికల నిర్వహణపై ఎప్పటికప్పుడు సూచనలు చేశారు. ఎన్నికల సిబ్బందికి మూడు విడుతలుగా శిక్షణ ఇచ్చి ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు పోలింగ్, కౌటింగ్‌లో ర్యాండమైజేషన్ ద్వారా విధులను అప్పగించారు. ఇందు కోసం 4600 మంది ఉద్యోగులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొన్నారని అధికారులు తెలిపారు.

**• అందరి సహకారంతోనే ఎన్నికల ప్రక్రియ పూర్తి**

అందరి సహకారంతోనే నిర్మల్ జిల్లాలో ఎన్నికల పక్రియను పూర్తి చేస్తామని కలెక్టర్ అశీష్ సంగ్వాన్ అన్నారు. నిర్మల్ జిల్లాలో 45 రోజుల పాటు నిర్వహించిన ఎన్నికల పక్రియ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, ప్రజలు, రాజకీయ పార్టీల నేతలు సహకరించారని తెలిపారు. జిల్లాలో రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల సమన్వయంతో ఎన్నికల నియామవళికి అనుగుణంగా ఎన్నికలను సమర్థవంతంగా పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు.

## నిందితుడికి ఐదేళ్ల జైలు

**• రెండు వేలు జరిమానా**

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 4 : భార్య ఆత్మహత్య చేసుకున్న కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన ఖారాగార శిక్షతో పాటు రూ.2000 జరిమానాను విధించినట్లు లైజన్ అధికారి సక్రియా నాయక్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. భైంసా పట్టణానికి చెందిన బాబుమియా తన కూతురిని మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన బబ్లూ ఖురేషికి ఇచ్చి వివాహం జరిపించాడు. తర్వాత భైంసా పట్టణంలోని ఓవైసీ వీధిలో నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు కొడుకులు, కూతురు జన్మించింది. తన భర్త బాబుమియా పెండ్లి అయిన నుంచి మద్యానికి అలవాటై భార్యను నిత్యం కొడుతుండడంతో పెద్ద మనుషుల ముందు పంచాయితీ పెట్టినా తన తీరు మారలేదు. ఎప్పటిలాగే తాగి వచ్చి కొడుతుండగా 23-7-2021 రాత్రి పది గంటలకు పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేయ గా..దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ 25-7-2021న మృతి చెందింది. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు కాగా..నేరపరిశోధనలో సోమవారం వై.రమణారావు 14 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి అజేశ్‌కుమార్ నిందితుడు బబ్లూ ఖురేషికి ఐదేళ్ల జైలు రూ.2000 జరిమానాను విధిస్తూ తీర్పును వెల్లడించారు.

## దాడి చేసిన వారిపై కేసు నమోదు

గర్మిళ్ల, డిసెంబరు 4: దాడి చేసి గాయపర్చిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల పట్టణ ఎస్సై జగదీశ్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం... జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాలకు చెందిన బోయిని శేఖర్ తన స్నేహితులతో కలిసి ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో పాత మంచిర్యాల బస్టాండ్ వద్ద మాట్లాడుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన పెంట రవి పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని తన స్నేహితులతో కలిసి బోయిని శేఖర్‌తో పాటు అతని స్నేహితులతో కలిసి దాడి చేసి గాయపర్చారు. దాడిలో గాయపడిన వారిని స్థానికులు ప్రైవేటు దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. బోయిని శేఖర్ ఇచ్చిన ఫిర్యాదుతో దాడి చేసిన పెంట రవి, అతని స్నేహితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య

చింతలమానేపల్లి , డిసెంబర్ 5 మండలంలోని రవీంద్రనగర్-1 గ్రామంలో సోమవారం పురుగు మందు తాగి యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఎఎస్ఐ యాదవ్ తెలిపిన ప్రకారం.. రవీంద్రనగర్ -1 గ్రామానికి చెందిన ఊర్మిల మండల్ (21 )ఈ నెల 2 న యువతి తండ్రి కేనారం మండల్ పనులు ముగించుకుని ఇంటికి వచ్చే సరికి ఇంటి పనులు చేయకుండా ఉండడంతో కూతురుని పనులు చేయ లేదని మందలించగా క్షణికావేశంతో ఇంట్లో వ్యవసాయానికి ఉపయోగించే గుర్తు తెలియని పురుగు మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రైవేటు వాహనంలో నజ్రుల్‌నగర్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషయమించడంతో ఆదివారం చికిత్స పొందుతూ మృతిచెందింది. తండ్రి కేనారం మండల్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించినట్లు ఏఎస్ఐ యాదవ్ తెలిపారు.